మార్కండేయస్వామినిఊ రేగిస్తున్న భక్తులు

వైభవంగా మార్కండేయస్వామి ఉత్సవాలు

- ప్రత్యేక రథంపై ఊరేగిన స్వామివారు
- ఆకట్టుకున్న మహిళల కోలాటం

గద్వాలటౌన్, ఫిబ్రవరి 12 : భక్త మార్కండేయస్వామి జయంతి ఉత్సవాలను జిల్లా కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలీ యువజన సంఘం, పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు పార్వతీ పరమేశ్వరీలకు అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం మార్కండేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి కోట సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగించారు. ప్రధాన రహదారుల గుండా రథోత్సవం సాగింది. కార్యక్రమంలో మహిళల చెక్క కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అదేవిధంగా స్వామివారిని ప్రత్యేక ఊయలపై ఉంచి మహిళలు పాటలు పాడుతూ డోలారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీలతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోటీలనుప్రారంభిస్తున్నచైర్ పర్సన్‌కరు ణశ్రీ

అంతర్రాష్ట్ర పశు బలప్రదర్శన పోటీలు ప్రారంభం

పెబ్బేరు, ఫిబ్రవరి 12: పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో సోమవారం ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర పశు బలప్రదర్శన పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రె స్వామి ప్రారంభించారు. వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చారెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్, ఆంజనేయులు, రామన్‌గౌడ్, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, బిచ్చన్న, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయిజ పట్టణంలోహై లెవల్ వంతెన పనులు పరిశీలిస్తున్న డీఈ కిరణ్

హైలెవెల్ వంతెన పనులు వేగవంతం

- ఆర్‌అండ్‌బీ డీఈ కిరణ్

అయిజ, ఫిబ్రవరి 12 : పట్టణంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ కిరణ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన పనులను డీఈ పరిశీలించారు. రూ. 5.70కోట్ల వ్యయంతో నాలుగు లేన్లతో వంతెన పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే వంతెన పనులు పూర్తి దశకు చేరుకున్నాయని, ఇరువైపుల అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు కొంత సమయం పడుతుందన్నారు. అలాగే అయిజ నుంచి మేడికొండ మీదుగా పులికల్ బీటీ రోడ్డు పనులు వారంలోగా పనులు వేగిరం చేస్తామన్నారు. పోలోనివాగుపై వంతెన నిర్మాణ పనులకు ఇప్పటికే శ్రీకారం చుట్టామన్నారు. అయిజ– గద్వాల రహదారిలో కట్టుకింద తిమ్మప్పస్వామి ఆలయ సమీపంలో పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్డుకు టెండర్ పూర్తి చేశామని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని డీఈ చెప్పారు. కార్యక్రమంలో ఏఈ మహేశ్, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

కొత్తకోట, ఫిబ్రవరి 12: మండలంలోని అమడబాకులలో స్వయంభూ కల్యాణలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శోభకృత నామ సంవత్సర మాగశుద్ధ తదియ 10:20 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు మహా పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠ, విశేషహారతి నిర్వహించారు. పూజా కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, కృష్ణయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బుచ్చన్న, శశిరెడ్డి, సత్యారెడ్డి, రాము, సురేంద్రచారి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం

పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కనిమెట్టలో మోజర్ల ఉద్యాన కళాశాల వారి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు రాణి, హరీశ్, పరమేశ్ పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 7 ఫిర్యాదులు

ఫిర్యాదుదారులతో సమస్యలను అడిగి తెలుసుకొంటున్న ఎస్పీ రక్షితా మూర్తి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 12: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు అందాయని ఎస్పీ రక్షితా మూర్తి అన్నారు. ఫిర్యాదుదారులతో ఆమె స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భార్యాభర్తల ఫిర్యాదులు 2, భూ తగాదా ఫిర్యాదులు ఐదు అందాయనితెలిపారు.

న్యాయవాదికి ప్రశంసాపత్రం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 12: జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భక్షి చంద్రశేఖర్‌రావుకు ఎస్పీ రక్షితామూర్తి సోమవారం తన చాంబర్‌లో ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మదనాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022, ఏప్రిల్ 20నాటి పోక్సో కేసులో భక్షి చంద్రశేఖర్‌రావు వాదనలు వినిపించడం, నేరం రుజువై, అప్పట్లో నేరస్తుడికి రూ.2వేల జరిమానా, 20 ఏండ్ల 6నెలల కఠిన కారాగార శిక్ష పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రశంసాపత్రం అందజేస్తున్నామని పేర్కొన్నారు.

SHRIRAM Finance వాహనములు అమ్మబడును

SNo.	VEHICLE ID.	VEHICLE DESCRIPTION	MODEL
1	AP16TY-5335	TATA LPT 3118 CUMMINS FBT	2010
2.	TS32B-6725	MAHINDRA 475 DI	2018

గమనిక: పైన తెలుపబడిన వాహనములు క్రింద కనబరచిన తేదీల యందు వేలం వేయబడును. తేది : 13th, 20th & 27- 02-2024
అడ్రస్ : శ్రీరామ ఆటో మాల్ యార్డ్, భూత్పూర్, మహబూబ్‌నగర్

శ్రీరాం ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్
D.No.7-40/1, శ్రీనివాసపూర్, పెబ్బేర్ రోడ్, వనపర్తి
Cell: 9849900287, 08545 - 230045

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోశ్

గద్వాల, ఫిబ్రవరి 12: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నదని కలెక్టర్ సంతోశ్ అన్నారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 150 దరఖాస్తులు అందాయని, వాటిలో భూ సమస్యలపై 93, ఇతర సమస్యలపై 57 ఉన్నాయని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కరించారో ప్రతివారం నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈవీఎంల చెకింగ్

- అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

గద్వాల, ఫిబ్రవరి 12: ఈవీఎంల పరిశీలన పారదర్శకంగా కొనసాగుతున్నదని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని గోదాంలో ఎల క్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 826(ఈవీఎంలు) బ్యాలెట్ యూనిట్లు, 769 కంట్రోల్ యూనిట్లు, 930 వీవీ ప్యాట్స్ మొదటి లెవల్ చెకింగ్ పూర్తి చేశామని, రెండ్రోజుల్లో మిగిలిన ఈవీఎంల తనిఖీ పూర్తి చేస్తామన్నారు. ఏడుగురు ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందం ఆధ్వర్యంలో మొదటి లెవల్ చెకింగ్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు తాసీల్దార్లు మంజుల, ధనుంజయ, నరేశ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోశ్

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఉత్తనూర్‌లో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

అయిజ, ఫిబ్రవరి 12 : ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు.

- ధ్వజారోహణంతో సకల దేవతలకు ఆహ్వానం

మండలంలోని ఉత్తనూర్ గ్రామంలో కొలువుదీరిన ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. 8గంటలకు పంచామృతాభిషేకం, బిందె సేవ, దేవతాహ్వానం, భేరిపూజను నిర్వహించిన అర్చకులు ఆలయ ధ్వజస్తంభంపై గరుడ పతాకావిష్కరణతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణ చేశారు. ధ్వజారోహణానికి ముందు శ్రీదేవి, భూదేవి సమేత ధన్వంతరి వేంకటేశ్వరస్వామి పరివార దేవతలైన అనంతుడు, (ఆదిశేషుడు) గరుత్మంతుడు, విశ్వక్సేనుడు, గరుడధ్వజం, సుదర్శనచక్రంతో కలిసి ఆలయ ప్రాంగణంలో ఊరేగుతూ కనువిందు చేశారు. అనంతరం స్వామి వారికి పల్లసేవ నిర్వహించారు. సంతాన ప్రాప్తి కలిగేందుకు మహిళలకు గరుఢ ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

శ్రీవారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి ..

ఉత్తనూరులోని ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వస్వామి కల్యాణం జరిపించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం రాత్రి 11:45గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం, గరుడవాహన సేవ నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది.

నేడు ప్రభోత్సవం..

ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రభోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం ఆలయంలో నిత్య పూజలు చేయడంతోపాటు రాత్రి 12 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ప్రభోత్సవం ఊరేగనున్నారు. అనంతరం హన్మద్వాహన సేవ నిర్వహించనున్నారు.

ప్రైవేట్ దవాఖానలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి,ఫిబ్రవరి 12: ప్రైవేట్ దవాఖానలు, వైద్యపరీక్షల కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు క్లినిక్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్–2010కి లోబడి ఉండాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రైవేట్ దవాఖానల రిజిస్ట్రేషన్ జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆరు దవాఖానలు, ఒక డయాగ్నోస్టిక్ సెంటర్‌కు దరఖాస్తు రాగా సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో కమిటీ ఆ దరఖాస్తులను పరిశీలించారు. జిల్లా కేంద్రంలో అమ్మ దవాఖాన రెన్యువల్, మైక్రో ల్యాబ్ డయాగ్నోస్టిక్ సెంటర్, ఆయార పాలి క్లినిక్, ఘనపురంలో లక్ష్మీనరసింహ క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్, పెబ్బేరులో లక్ష్మీమహాదేవ దవాఖాన, ఆత్మకూర్‌లో ఆదిత్య చిన్నపిల్లల దవాఖాన నుంచి దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిలో అమ్మ దవాఖాన వారు గడువు తీరినప్పటికీ బయోమెడికల్ వేస్టేజ్ ద్రువీకరణ పత్రం సమర్పించకపోవడం వల్ల, అలాగే ప్రసన్న పాలి క్లినిక్‌లో వైద్య సిబ్బంది లేకపోవడం వల్ల వీరి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోయినా, సకాలంలో లైసెన్స్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోపోయినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య అధికారి జయచంద్రమోహన్, పట్టణ సీఐ నాగభూషణ్‌రావు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు త్వరగా పరిష్కరించాలి

ప్రజా సమస్యలపై అందిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో పద్మావతి, జెడ్పీ సీఈవో రామామహేశ్వర్‌రెడ్డితో పాటు ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన మొత్తం 60 ఫిర్యాదులు పరిష్కరించి వారికి సందేశం పంపాలని సూచించారు. అనంతరం రెడ్‌క్రాస్ కార్యదర్శిగా సేవలందించి అకాలమరణం పొందిన ఖాజా కుతుబుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సుధీర్ఘ కాలం సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇండ్ల మధ్య ఉన్న రైస్‌మిల్లు తరలించాలి

పట్టణంలోని పాన్‌గల్ రోడ్డులోని ఫరీద్ రైస్‌మిల్లు చుట్టూ నివాసాలు ఉన్నాయని, ప్రజలకు ఇబ్బందికరంగా మారి నందు వల్ల వెంటనే మరో చోటుకు తరలించాలని ఆరోవార్డు ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైస్‌మిల్లు నుంచి వచ్చే పొట్టు, వాసనను భరించలేక పోతున్నామని, శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిమల్ల చంద్రమౌళి, శ్రీను, నిఖిల్‌దాసు, రామ్‌నాయక్, చంద్ర, వంశీ, సంపత్ పాల్గొన్నారు.

జిల్లా వైద్యఆరోగ్య పర్యవేక్షణ కమిటీతో సమావేశమైన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నేడు 'చలో నల్లగొండ'కు తరలిరండి

వనపర్తి, ఫిబ్రవరి 12: మన నీళ్లు.. మన హక్కు పోరాటంపై బీఆర్ఎస్ మంగళవారం చేపట్టనున్న చలో నల్లగొండ కార్యక్రమానికి జిల్లా నుంచి భారీ ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్ సోమవారం సంయుక్త ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇంటి నుంచి ఉదయం 8గంటలకు బయలుదేరాలని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పాన్‌గల్, ఫిబ్రవరి 12: మండలంలోని మాందాపూర్‌లో బోయ ఎల్లస్వామికి చెందిన పూరిగుడిసె సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దానిపక్కనే ఉన్న మరో పూరి గుడిసె పాక్షికంగా కాలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. చుట్టు పక్కలవారు గమనించి నీళ్లు చల్లి మంటలను ఆర్పారు. ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పారు. గుడిసెలో రెండు బస్తాల బియ్యం, వంటసామగ్రి, దుస్తులు కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆబ్కారీ శాఖలో బదిలీలు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 12: రాష్ట్ర వ్యాప్తంగా ఆబ్కారీ శాఖలో అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లా అబ్కారీ శాఖ ఇన్‌చార్జిగా ఉన్న సైదులను యాదాద్రి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో డి.అరుణ్ కుమార్‌ను నియమించారు. అలాగే గద్వాల సర్కిల్ అబ్కారీ శాఖ సీఐగా విధులు నిర్వహిస్తున్న గోపాల్‌ను ధూల్‌పేటకు, డీటీఎఫ్ సీఐ బానోత్ పటేల్‌ను అమీర్‌పేటకు బదిలీ చేశారు. వారి స్థానంలో మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న గణపతిరెడ్డిని గద్వాల సర్కిల్ అబ్కారీ శాఖ సీఐగా, అమీర్‌పేటలో విధులు నిర్వహిస్తున్న సైదిరెడ్డిని డీటీఎఫ్ సీఐగా బదిలీ చేశారు. నందిన్నె చెక్‌పోస్టు అబ్కారీ శాఖ సీఐలుగా లక్ష్మణ్‌గౌడ్, మొగులయ్యనాయక్‌ను నియమించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20మందికి జరిమానా

అలంపూర్,ఫిబ్రవరి 12 : అలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో 20మందిపై కేసులు నమోదు కాగా, వారందరిని సోమవారం అలంపూర్ కోర్టులో జడ్జి ఎదుట హాజరు పర్చగా వారిలో 12 మందికి ఒక్కొక్కరికిరూ.2వేల జరిమానా, మరో 8 మందికి జరిమానాతో పాటు రెండు రోజులు రోజులు జైలు శిక్ష విధించినట్లు అలంపూర్ ఎస్సై నాగరాజు తెలిపారు.

కుక్కల దాడిలో 37 గొర్రె పిల్లలు మృతి

ఉండవెల్లి, ఫిబ్రవరి 12 : గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని కంచుపాడు గ్రామానికి చెందిన ఆంజనేయులు గొర్రెల మందను తీసుకొని మేతకు వెంట వెళ్లాడు. ఇంటి వద్ద కంచె ఏర్పాటు చేసి చిన్న గొర్రె పిల్లలను వదిలి వెళ్లడంతో కుక్కలు దాడి 40గొర్రెలపై దాడి చేయగా 37మృతి చెందాయని రూ.2.50 లక్షల నష్టం జరిగినట్లు రైతు ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశాడు

పరమశివుడి అనుగ్రహంతోనే ఆలయాల జీర్ణోద్ధరణ

- మంత్రాయం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు

అయిజ, ఫిబ్రవరి 12 : పరమశివుడి అనుగ్రహంతోనే భ్రమరాంభిక, గుంతరామ లింగేశ్వరాలయాలు జీర్ణోద్ధరణ జరిగిందని కర్నూల్ జిల్లాలోని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు అన్నారు. సోమవారం పట్టణంలోని భ్రమరాంభిక, గుంతరామలింగేశ్వరాల యంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనెత్సవాలకు పీఠాధిపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఠాధిపతి భక్తులనుద్దేశించి ప్రవచనాలు పలికారు. త్రేతాయుగంలో శ్రీరాముడు దండకారణ్య యాత్రలో భాగంగా అయిజ గ్రామానికి వచ్చి స్వయాన శ్రీరాముడు, సీతమ్మల స్వహస్తాలతో రెండు శివలింగాలను ప్రతిష్ఠించారన్నారు. అంతకుముందు భ్రమరాంభిక, గుంతరామలింగేశ్వరాలయంలో పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రఘుశర్మ, భక్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు

నల్లబెల్లం పట్టివేత

- 153 క్వింటాళ్లు , లారీ స్వాధీనం

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 12: అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్న ఘటన జిల్లాలో చోటు చేసుకొన్నది. అబ్కారీ శాఖ గద్వాల సర్కిల్ సీఐ గోపాల్ వివరాల మేరకు.. సోమవారం తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు చెందిన లారీలో దాదాపు 510కి పైగా నల్లబెల్లం బస్తాలను అక్రమంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రదేశాలకు సరఫరా చేస్తున్నారు. అదే క్రమంలో సాయంత్రం ధరూర్ మండలం పరిధిలో కొత్త పాలెం స్టేజీ సమీపంలో ఆయా తండాల్లో బెల్లం బస్తాలను సరఫరా చేస్తూ రాయిచూర్‌కు తరలించే ప్రయత్నించారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న అబ్కారీ శాఖ అధికారులు బెల్లం తరలిస్తున్న లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వాహనంలోని 510 బెల్లం బస్తాలు, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం డ్రైవర్ మోహన్‌రాజ్‌తో పాటు మరో వ్యక్తి సునిల్‌శెట్టిపై కేసు నమోదు చేశామని, పూర్తి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ బానోత్ పటేల్, ఎస్సైలు కృష్ణ, గోవర్ధన్ ఉన్నారు.

పోస్టుకార్డు ద్వారా సీఎంకు సమస్యల వినతి

గట్టు, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను సోమవారం పీడీఎస్‌యూ నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపోవడం లేదని బాలికలు తెలిపారు. ఈ సమస్యలు పోస్టుకార్డుల్లో రాసి సీఎం రేవంత్‌రెడ్డికి పంపామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అహ్మద్, ధనుంజయ, వికాస్, అనిల్‌కుమార్, రాము పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

ఇటిక్యాల, ఫిబ్రవరి 12 : గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జి ధరించి నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రమోషన్లు బదిలీలు చేపట్టాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని,అన్ని గురుకులాలను ఒకే యాజమాన్యం కిందకు తేవాలని, అన్ని డిగ్రీ కళాశాలలో ఏవో పోస్టులను మంజూరు చేయాలని, అకారణమైన సస్పెన్షన్లు ఎత్తి వేయాలని పలు డిమాండ్లను ప్రకటించారు. గురుకుల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు తుదపరి కార్యాచరణ ఉంటుందన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కొత్తకోట,ఫిబ్రవరి12: పట్టణ సమీపంలోని సాంఘిక సంక్షేమ వీపనగండ్ల గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దయాకర్ మాట్లాడుతూ తెలంగాణలో 1,022 పాఠశాల, కళాశాలల్లో పని చేస్తున్న 20వేల మంది ఉపాధ్యాయులకు సుమారు పదివేల మందికి ప్రమోషన్లు, బదిలీల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. జీవో 317 ద్వారా బదిలీలు, ప్రమోషన్లు చేపట్టకుండా నూతన నియామకాలు చేపట్టడాన్ని నిరసిస్తూ, గురుకుల జేఏసీగా ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపట్టామని, ఇందులో భాగంగా తాము నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లెప్రసీపై అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్, ఫిబ్రవరి 12 : లెప్రసీపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పారా మెడికల్ ఆఫీసర్ మల్లికార్జున్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు లెప్రసీ పరీక్షలు సోమవారం నిర్వహించారు. లెప్రసీ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

'చలో నల్లగొండ' సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 12: కృష్ణానది జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న చలో నల్లగొండ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నేడు (మంగళవారం) మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమయ్యే సభకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

వివిధ శాఖల అధికారులు బదిలీ

గద్వాల, ఫిబ్రవరి 12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం వివిధ శాఖల అధికారులను బదిలీ చేసింది. జోగులాంబ గద్వాల జిల్లాలో పనిచేస్తున్న డీపీవో శ్యాంసుందర్‌ను నారాయణపేట డీపీవోగా, రంగారెడ్డి జిల్లా డీపీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని గద్వాల డీపీవోగా నియమించింది. గద్వాల డీఆర్‌డీవోగా పని చేస్తున్న ఉమాదేవి వనపర్తికి బదిలీ కాగా, నాగర్‌కర్నూల్ డీఆర్‌డీవోగా పని చేస్తున్న నర్సింగ్‌రావును జోగులాంబ గద్వాల డీఆర్‌డీవోగా బదిలీ అయ్యారు. జెడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న ముసాయిదాబేగంను అడిషనల్ డీఆర్‌డీవోగా మహబూబ్‌నగర్ బదిలీ చేశారు. మల్కాజ్‌గిరిలో పని చేస్తున్న అరుణ్‌కుమార్‌ను గద్వాల డీపీఈవోగా నియమించింది.

పలువురు అధికారుల బదిలీ

వనపర్తి, ఫిబ్రవరి 12: వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా డీపీవో, డీఆర్డీవో, జెడ్పీ సీఈవోను బ